# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా భారత రాజ్యాంగం నిలిచిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.
2. **రాజ్యాంగ స్పూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**
4. **ఆంధ్రప్రదేశ్ శాసనసభను కాగిత రహితంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.**
5. **మహారాష్ట్రలోని ముంబైలో 2008 నవంబర్ 26వ తేదీన ఉగ్రవాదులు జరిపిన మారణ హోమానికి నేటితో 16 ఏళ్లు పూర్తయ్యాయి.**

=========================

దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దేశ రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలోని పాత పార్లమెంట్ ప్రాంగణంలోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75వ స్మారక నాణాన్ని, తపాలా స్టాంపును రాష్ట్రపతి విడుదల చేశారు అనంతరం ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, దేశానికి మూలస్తంభం వంటి రాజ్యాంగం 75 ఏళ్ల క్రితం ఇదేరోజున ఆమోదం పొందిందని కొనియాడారు. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగిందని రాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ ( 37 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభాపతి ఓం బిర్లా సహా పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. కాగా ఈరోజు సాయంత్రం సుప్రీంకోర్టులో జరగనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రకాశం, శ్రీకాకుళం,

తిరుపతి, పశ్చిమగోదావరి, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొని రాజ్యాంగ ప్రతిజ్ఞను చేశారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు అన్షుమన్ ప్రసాద్ దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్...28 సెకన్లు

---------------------------

రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు రాజ్యాంగ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్...37 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి కార్యాచరణపై సంబంధిత అధికారులతో ఉపముఖ్యమంత్రి నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ఆలయాలు, పర్యావరణం, సాహస క్రీడలు వంటి అంశాల్లో పర్యాటకరంగ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. వారసత్వ సంపదకు ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందని చలన చిత్రాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించవచ్చని తెలిపారు. రాష్ట్రాన్ని పర్యాటకానికి కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభను, శాసనమండలిని కాగిత రహిత విధానం డిజిటల్ రూపంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో 'నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ -నేవా' ఒప్పందాన్ని నిన్న కుదుర్చుకున్నారు. అనంతరం ఏపీ భవన్‌లో అయ్యన్నపాత్రుడు పాత్రికేయులతో మాట్లాడుతూ, నేవా అప్లికేషన్ అమలు ద్వారా సభా కార్యకలాపాలన్నీ డిజిటల్‌గా నిర్వహించడానికి వీలవుతుందన్నారు. బిల్లులు ప్రవేశపెట్టడం, కమిటీల నివేదికలు సమర్పించడం వంటివి.. అంతా డిజిటల్ రూపంలోనే సాగుతాయని, వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ విధానం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు వివరించారు.

---------------------------

మహారాష్ట్రలోని ముంబైలో 2008 నవంబర్ 26వ తేదీన ఉగ్రవాదులు జరిపిన మారణ హోమానికి నేటితో 16 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ రోజున ఉగ్రవాదులు జరిపిన దాడిలో పలువురు పోలీసు అధికారులతో సహా 166 మంది అసువులు బాశారు. ఈ నరమేధం దేశ చరిత్రలో మరచిపోలేని దుర్ఘటనగా నిలిచిపోయింది. ముంబై

ఘటనలో అమరులైన వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ దేశ ప్రజలు ఈరోజు వారికి ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి మూత్రపిండ బాధితులకు డయాలసిస్ కేంద్రం త్వరలో అందుబాటులో తెస్తామని తెలిపారు.

---------------------------

దీర్ఘకాల వ్యాధుల నుండి స్వస్థత కలుగచేసే ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు  అవగాహన కల్పించడానికి ఈరోజు నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు దేశ్‌కి ప్రకృతి పరీక్షణ్ అభియాన్ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయుష్ కమిషనర్ డాక్టర్ మంజుల తెలిపారు. ఆయుర్వేద ఔషధ ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే  లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా  ఈరోజు శ్రీకాకుళంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయుర్వేద వైద్యులు పాల్గొని.. ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు.

---------------------------

దేశవ్యాప్తంగా లింగవివక్షకు వ్యతిరేకంగా 'నయిచేతన 3.0' పేరుతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా  రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ – సెర్ప్, గ్రామ–వార్డు సచివాలయాలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం  పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాలశాఖ సంచాలకులు  శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 23వ తేదీ వరకు నాలుగు వారాలపాటు కార్యక్రమాలను  చేపట్టనున్నామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న  మహిళా పోలీసులు ద్వారా ప్రజలకు లింగ వివక్ష పై అవగాహన కల్పించేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని  ఆదేశాలు జారీచేశారు.

---------------------------

ఎన్టీఆర్ భరోసా కింద డిసెంబరు నెల పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే నెల డిసెంబరు 1న ఆదివారం సెలవుదినం కావడంతో ఒక రోజు ముందుగానే ఈ నెల 30న ప్రభుత్వం పింఛన్ల పంపిణీ చేయనున్నామని తెలిపింది. 30న ఏదైనా కారణాలతో తీసుకోలేని వారికి రెండో తేదీన సోమవారం అందించనున్నామని, అధికారులు తెలిపారు. ఈ నెలలో పింఛను తీసుకోని 21 వేల 788 మందికి రెండు నెలల మొత్తం కలిపి డిసెంబరులో అందజేస్తామన్నారు. మొత్తంగా వచ్చే నెలలో సామాజిక భద్రతా పింఛన్ల కింద  63.92 లక్షల మంది పింఛన్ దారులకు  2 వేల 709 కోట్ల రూపాయల నగదు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

=====================